క్లుప్తంగా

పారదర్శకంగా ఓటర్ల నమోదు



బీఎల్వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్ సూర్యారావు

కపిలేశ్వరపురం: పారదర్శకంగా ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని తహసీల్దార్ కొమరం సూర్యారావు గ్రామ స్థాయి అధికారులను ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు ఈ నెల 4, 5, డిసెంబర్ 2, 3 తేదీల్లో ఓటరు నమోదుపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఇప్పటికే నమోదైన ఓటరు జాబితాలను సచివాలయ కార్యాలయాల్లో ప్రదర్శించాలన్నారు. బీఎల్వోలకు ప్రత్యేక సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, బీఎల్వో అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక యాప్‌లో ఆరోగ్య వివరాలు



యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కపిలేశ్వరపురం: ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ యాప్‌లలో ప్రజల ఆరోగ్య వివరాలను నమోదు చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలపై గ్రామ వైద్య ఆరోగ్య కార్యకర్తలు, వలంటీర్లు ఆయా యాప్‌లలో బీపీ, షుగరు, ఇతర ఆరోగ్య వివరాలను నమోదు చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి బీపీ తదితర పరీక్షలు చేసి సంబంధిత వివరాలను నమోదు చేస్తున్నట్టు అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.రత్నకుమార్, పి.చంద్రమౌళి, కరుణేంద్రకుమారి తెలిపారు.

సేవా దృక్పథంతో శ్రమించాలి



అంగర సచివాలయంలో సూచనలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

కపిలేశ్వరపురం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సకాలంలో పేద, మధ్య తరగతి ప్రజలందరికీ అందేలా సేవా దృక్పథంతో వలంటీర్లంతా పనిచేయాలని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి సూచించారు. అంగర సచివాలయంలో గురువారం వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సంబంధిత అధికారులు, ఉద్యోగులు, కార్యకర్తలను అభినందించారు. అదే ఒరవడితో ఇతర పథకాల అమలుకు సహకరించాలన్నారు.

ఇంటి వద్దే వైద్య పరీక్షలు



తాతపూడిలో ఇంటి వద్ద మహిళ ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న డాక్టర్ గీతాంజలి

కపిలేశ్వరపురం: తాతపూడి బీసీ ఏరియాలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి రాలేని వృద్ధుల ఇంటికి అంగర పీహెచ్‌సీ వైద్యులు జీవీ గీతాంజలి తన సిబ్బందితో వెళ్లి వైద్యపరీక్షలు చేశారు. శిబిరంలో 72 మందిని పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. బీపీ షుగరు వంటి పరీక్షలు చేసి జాగ్రత్తలు చెప్పారు. శిబిరంలో పీహెచ్‌సీ, 104 సిబ్బంది వైద్యసేవలందించారు. శిబిరాన్ని ఎంపీటీసీ జుత్తుక వెంకటలక్ష్మి, కార్యక్రమంలో పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ జుత్తుక మల్లికార్జునరావు, హెచ్ఈ బి.రామారావు, ఎంఎల్‌హెచ్‌పీ ఆశ, వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడి చేశారంటూ ఫిర్యాదు

రామచంద్రపురం రూరల్: స్థల వివాదం నేపథ్యంలో తనపై దాడి చేశారంటూ ఓ మహిళ చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ద్రాక్షారామ ఎస్సై ఎం.ఎస్‌ఎస్ భుజంగరావు గురువారం విలేకర్లకు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వెంకటాయపాలెంలోని వీరేశగుప్త కాలనీలో ఉంటే శ్యామలత 14 ఏళ్ల క్రితం ఇల్లు కొనుక్కుని నివాసం ఉంటోంది. తన ఇంటి వద్ద రోడ్డు, డ్రైన్లు నిర్మించాల్సి ఉండగా వాటికి అడ్డం వచ్చేలా అదే గ్రామానికి చెందిన పడమటి రాజేశ్వరి ఇంటి నిర్మాణం ప్రారంభించారు. దీనిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా శ్యామలతపై పడమటి రాజేశ్వరి, పడమటి చిన్నబాబు, బొంతు అదిలక్ష్మి దాడి చేశారు. గాయపడిన ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందింది. ఆసుపత్రి సమాచారంతో పాటు శ్యామలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

స్వచ్ఛత.. మన బాధ్యత

- జగనన్న స్వచ్ఛ సంకల్ప సాధనకు బృహత్ ప్రణాళిక
- మంత్రి వేణు స్వీయ ఆలోచన
- పరిశుభ్రంగా మారుతున్న గ్రామాలు
- అమలు తీరును మెచ్చుకున్న కలెక్టర్



ద్రాక్షారామలోని డ్రైన్లలో పూడిక తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

రామచంద్రపురం రూరల్: గ్రామాలను ఆరోగ్యకర వాతావరణంతో పరిశుభ్రంగా తీర్చిదిద్దే సంకల్పంతో.. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ లక్ష్యాన్ని సాధించే క్రమంలో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ బృహత్ ప్రణాళిక రూపొందించారు. అక్కడితో వదిలేయకుండా ఇది పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. 'స్వచ్ఛత – మన బాధ్యత' పేరిట అమలు చేస్తున్న ఈ కార్యక్రమంతో గ్రామాలు చెత్త రహితంగా.. అద్దాల్లా మారుతున్నాయి. రోడ్ల పక్కన చెత్తకుప్పలు మాయమవుతున్నాయి. 'స్వచ్ఛత – మన బాధ్యత' అమలును కలెక్టర్ హిమాన్షు శుక్లా స్వయంగా పరిశీలించి తనకు ఈ కార్యక్రమం ఎంతో నచ్చిందంటూ ప్రశంసించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతామని, ఇది రాష్ట్రమంతటా అమలయ్యే అవకాశం ఉందని చెప్పారు.

అమలు చేస్తున్నారిలా..

'స్వచ్ఛత – మన బాధ్యత' రెండు రోజుల కార్యాచరణ. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని గ్రామాలను క్లస్టర్లుగా విభజించారు. ఒక్కో క్లస్టర్‌లోకి వచ్చే ఐదారు గ్రామాల పారిశుధ్య కార్మికులను నిర్దేశించిన గ్రామానికి రెండు రోజులు పాటు కేటాయిస్తారు. ఆ గ్రామ ఉపాధి హామీ కూలీలు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ఉత్సాహవంతులైన యువత, ముఖ్యంగా ఆ గ్రామ మహిళల సహకారం తీసుకుంటారు. మొదటి రోజు గ్రామంలోని వీధులు, ఇళ్ల పరిసరాలు, పిచ్చి మొక్కలు పెరిగిన ఖాళీ ప్రదేశాలు, చెత్త పోగు పడిన ప్రాంతాలను గుర్తిస్తారు. ఆ ప్రాంతాల్లో చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించి ఒకచోట చేరుస్తారు. అలా తొలగించిన మొత్తం చెత్త, వ్యర్థాలను రెండో రోజు పెద్ద గొయ్యి తీసి, అందులో వేసి చెత్తను ఎరువుగా మార్చేందుకు అవసరమైన రసాయనాలు వేసి, ఆ గోతిని మూసివేస్తారు. మూడు నెలల తరువాత ఆ గోతిని తెరచి ఎరువుగా మారిన చెత్తను గ్రామంలోని మొక్కలకు తిరిగి వినియోగిస్తారు. ఇదే కార్యాచరణను మూడు నెలలకు ఒకసారి పునరావృతం చేస్తారు. ఫలితంగా గ్రామాలు ఎప్పుడూ పరిశుభ్రంగా, స్వచ్ఛతతో ఉంటాయి. ప్రజలు కూడా ఆరోగ్యంతో జీవిస్తారు.

ప్రజల్లో స్ఫూర్తి నింపుతూ..

స్వచ్ఛత – మన బాధ్యత కార్యక్రమం అమలు చేసే గ్రామంలో మంత్రి వేణు స్వయంగా పాల్గొని, వారిలో స్ఫూర్తి నింపుతున్నారు. పారిశుధ్య కార్మికులపై గ్రామస్తుల్లో గౌరవం పెరిగేలా చేస్తున్నారు. రోగం వచ్చిన తరువాత తగ్గించిన వైద్యులు గొప్పవారైతే.. అసలు రోగమే రాకుండా మన చుట్టూ ఉన్న చెత్త, మురుగును తొలగించే పారిశుధ్య కార్మికుడు ప్రథమ వైద్యుడని చెబుతున్నారు. పారిశుధ్య కార్మికులకు ఎంతో కొంత పని భారం తగ్గించేందుకు వీలుగా చెత్తను ప్లాస్టిక్, మట్టిలో కలిసిపోయే తడి వ్యర్థాలుగా వేరు చేయాలని ప్రజలకు ముఖ్యంగా మహిళలకు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే వారికి అందించడం ద్వారా కొంత సొమ్ము కూడా వస్తుందని, అలాగే తడి వ్యర్థాలను చిన్న గొయ్యి తీసి పాతిపెట్టడం ద్వారా ఎరువుగా మార్చుకుని, తిరిగి మొక్కలకు వాడుకోవచ్చని అవగాహన కల్పిస్తున్నారు. రెండు రోజుల పాటు చేసిన ఈ పనితో వస్తున్న మార్పును శాశ్వతంగా కొనసాగేలా గ్రామస్తులు నిత్యం కృషి చేయాలని మంత్రి వేణు కోరుతున్నారు.

మా ఊరు అద్దంలా మారిపోయింది



మంత్రి వేణు సూచనల మేరకు మా గ్రామంలో స్వచ్ఛత – మన బాధ్యత కార్యక్రమం నిర్వహించాం. ఇతర గ్రామాల నుంచి పారిశుధ్య కార్మికులను తీసుకుని వచ్చి రెండు రోజుల్లో మా గ్రామాన్ని అద్దంలా మార్చేశారు. ఈ మార్పు శాశ్వతంగా ఉండేలా మా గ్రామస్తుల సహకారంతో కృషి చేస్తాం.

– రాయుడు సీతామహాలక్ష్మి, సర్పంచ్, నెలపర్తిపాడు, రామచంద్రపురం మండలం

పక్క ఊళ్లో పని చేయడమేమిటనిపించింది కానీ..



ఈ కార్యక్రమం గురించి ముందుగా చెప్పినప్పుడు మన ఊళ్లో పనే మనకి సరిపోతోంది.. పక్క ఊళ్లో మనం చేయడమేమిటని అనిపించింది. కానీ అక్కడి పారిశుధ్య కార్మికులతో కలసి ఆ ఊరు మొత్తం శుభ్రం చేయడం, దానివల్ల అక్కడి జనంలో కలిగిన ఆనందం చూసిన తరువాత మంచి కార్యక్రమమని అనిపించింది. మా పారిశుధ్య కార్మికులపై మంత్రి వేణు చూపిస్తున్న ఆప్యాయత సంతోషం కలిగిస్తోంది. దసరా పండగ రోజున మా కార్మికులందరికీ పాదపూజ చేసి ఎంతో గౌరవించారు. అదే గౌరవ భావం ప్రజలందరిలో కలిగేలా కృషి చేస్తున్నారు.

– గూడుపు పోతురాజు, పారిశుధ్య కార్మికుడు, ద్రాక్షారామ

చక్కని ప్రణాళికతో..



స్వచ్ఛత – మన బాధ్యత అమలు చేసిన గ్రామాల్లో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయి. దీని అమలును కలెక్టర్ కూడా మెచ్చుకున్నారు. గ్రామాలన్నీ స్వచ్ఛత వైపు అడుగులు వేస్తున్నాయి.

– ఎస్.కీర్తి స్పందన, ఎంపీడీఓ, రామచంద్రపురం

ఉద్యమంలా..



ఓదూరులో రోడ్ల పక్కన తుప్పలను తొలగిస్తున్న ఉపాధి హామీ కూలీలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛత – మన బాధ్యత కార్యక్రమాన్ని గురువారం ఉద్యమంలా నిర్వహించారు. ఆయా గ్రామాల పారిశుధ్య కార్మికులు, ఉపాధి హామీ కూలీలతో కలసి రోడ్లకు ఇరువైపులా పెరిగిన తుప్పలను తొలగించడం, పేరుకుపోయిన చెత్తను తొలగించడం, డ్రైన్లలో పూడికతీత తదితర పనులు పూర్తి స్థాయిలో చేస్తున్నారు. ఓదూరులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ వింజుమల్ల విమలకుమారి, ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, పంచాయతీ కార్యదర్శులు కేవీ శ్రీనివాస్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ద్రాక్షారామలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వార్డు సభ్యులు దేగల వెంకటరమణ, సాక్షి పద్మనాభం, పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్య సుబ్రహ్మణ్యం, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా (బాబ్జీ) తదితరులు పాల్గొన్నారు.



మొగలిపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, అధికారులు

స్వచ్ఛత అందరి బాధ్యత

కె.గంగవరం: తమ ఇళ్ల మాదిరిగానే గ్రామాలను కూడా పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. తామరపల్లిలో గురువారం స్వచ్ఛత – మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పారిశుధ్య కార్మికులతో కలసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను భద్రపరిచి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. దీంతోపాటు కూరగాయలు, ఇతర వ్యర్థాలను ఇంటి పెరట్లో గొయ్యి తీసి, దానిలో వేయడం ద్వారా ఎరువుగా మార్చి, పంట పొలాలకు, మొక్కలకు వేయాలని సూచించారు. సచివాలయ కన్వీనర్ తోకల శ్రీను, సర్పంచ్ తోకల మంగ, వైఎస్సార్ సీపీ నాయకులు వెంగళరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



తామరపల్లిలో పారిశుధ్య కార్మికులతో కలసి ర్యాలీ చేస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు

పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

కాజులూరు: అపరిశుభ్ర వాతావరణమే అంటువ్యాధులకు కారణమని, అందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని బందనపూడి సర్పంచ్ దేగల తిరుమలవేణి అన్నారు. బందనపూడి శివారు మొగలిపాలెంలో ఆమె ఆధ్వర్యాన స్వచ్ఛత – మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు, ఉపాధి హామీ పథకం కూలీలు గ్రామంలో చెత్తకుప్పలను, రహదారుల వెంబడి ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. నాయకులు, అధికారులు, వలంటీర్లు శ్రమదానం చేసి, వీధులు తుడిచి, శుభ్రం చేశారు. పారిశుధ్య నిర్వహణపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉప సర్పంచ్ నల్లమిల్లి సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ 'తోట'పై దుష్ప్రచారం చేస్తే సహించం



సమావేశంలో మాట్లాడుతున్న పాపారాయుడు

మండపేట: ఆపదలో ఉన్న అభాగ్యులకు అండగా నిలిచే ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు అన్నారు. ఇటీవల పట్టణంలో చోటు చేసుకున్న ఎంపీఎస్ స్కూల్ వివాదంపై విపక్ష నేతల ఆరోపణలను గురువారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద మీడియా సమావేశంలో పాపారాయుడు తిప్పికొట్టారు. స్కూల్‌లో 50 శాతం వాటా కలిగిన తనకు అన్యాయం చేస్తున్నారని రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన తండ్రితో కలిసి బాధితురాలు ఎమ్మెల్సీ తోటను ఆశ్రయించారన్నారు. ఆమె దీనస్థితిని చూసి ఆమె సొంత సామాజికవర్గానికి చెందిన ప్రముఖులతో సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేశారన్నారు. వివాదంతో స్కూల్ మూతపడగా 1,400 మంది విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా పాఠశాలను తెరిపించేందుకు ఎమ్మెల్సీ తోట చేసిన కృషిని పాపారాయుడు గుర్తు చేశారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్సీ తోట ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి విపక్ష నేతలకు వెన్నులో వణుకుపుడుతోందన్నారు. స్కూల్ వివాదాన్ని రాజకీయం చేసి లబ్ధి పొందాలన్న వారి ఆటలను ఎమ్మెల్సీ తోట సాగనివ్వలేదని పాపారాయుడు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ సర్పంచుల సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు, ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్ మాట్లాడుతూ, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన వేగుళ్ల జోగేశ్వరరావు నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. ఎమ్మెల్సీ తోట నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుండడంతో పాటు ఎన్నో దీర్ఘకాలిక సమస్యలకు చెక్ పెడుతున్నారన్నారు. గ్రామాల్లో ఆయనకు లభిస్తున్న జనాదరణతో తమకు మనుగడ కష్టమన్న భావనలో విపక్ష నేతలు కుట్ర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రామకృష్ణ, కె.రాంబాబు, శెట్టి నాగేశ్వరరావు, పి.సత్తిబాబు, ఎస్.ధనరాజు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

- ఎంపీపీ నౌడు వెంకటరమణ
- రాయవరం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణ

రాయవరం: ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీపీ నౌడు వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో వెంకటరమణ, శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతు సంక్షేమ ప్రభుత్వంలో రైతులకు మేలు చేసే విధంగా అధికారుల నిర్ణయాలు ఉండాలన్నారు. మండలంలోని సోమేశ్వరం జగనన్న లేఅవుట్ జిల్లాలోనే మోడల్ లేఅవుట్‌గా రూపుదిద్దుకుందన్నారు. నిర్మాణంలో ఉన్న సచివాలయాలు, ఆర్‌బీకేలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని వారు అధికారులకు సూచించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో అధికారులు అమలు చేయాలని సూచించారు. అనంతరం మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు ఆయా శాఖల ప్రగతిని వివరించారు. వ్యవసాయ, విద్యుత్, విద్య, ఆర్‌డబ్ల్యుఎస్ తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు కొవ్వూరి అమ్మిరెడ్డి, గుబ్బల సుబ్రహ్మణ్యం, పార్టీ విప్ కర్రి విజేత, తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబు, ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి, మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలతో రైతులకు మేలు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ కోటేశ్వరరావు

మండపేట: రైతుల పంట కష్టం దళారుల పాలుకాకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని వెలగతోడు సొసైటీ చైర్మన్ ముక్కపాటి కోటేశ్వరరావు అన్నారు. సొసైటీ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ కోటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఏ సీఎం చేయని విధంగా రైతుల అభ్యున్నతి సీఎం జగన్ అనేక పథకాలను అమలుచేస్తున్నారన్నారు. ప్రభుత్వ తోడ్పాటును రైతులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. సొసైటీ పర్సన్లు చిటికెన వీర్రాజు, పిల్లిల్లి చినఅప్పారావు, సీఈఓ చంద్రు ప్రదీప్, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు సాదే పిడుగురాముడు, ఆర్‌బీకే వీఏఏ జి ఆశాజ్యోతి, రైతులు పాలచర్ల కాశీవిశ్వనాథం, కోమలి నారాయణమూర్తి, బోగిళ్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సాయి నవరాత్ర వేడుకలు

కాజులూరు: గత నెల 24 నుంచి నిర్వహిస్తున్న సాయి నవరాత్ర ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు, విష్ణు సహస్ర సామూహిక పారాయణ, అష్టోత్తర విభూది పూజలు జరిపారు. రాత్రి వేళల్లో జ్యోతిర్లింగార్చన, గోపూజ, హరికథ, బుర్రకథ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు భక్తులు జ్యోతులు చేత పట్టుకుని సాయి నామ కీర్తనలు ఆలపిస్తూ గ్రామోత్సవాలు చేశారు. కాజులూరు, ఆర్యావటం, చేదువాడ, గొల్లపాలెం, శీల, దుగ్గుదుర్రు, కుయ్యేరు, ఉప్పుమిల్లి, పెనుమళ్ల, అయితపూడి, జగన్నాథగిరి తదితర గ్రామాల్లో బాబా నవరాత్ర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని పలు గ్రామాల్లో భారీగా అన్న సమారాధనలు నిర్వహించారు.

అటెన్షన్ ప్లీజ్

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయరూ..



ప్రమాదాలకు నిలయంగా ఉన్న మలుపు

కె.గంగవరం మండలం తామరపల్లి గ్రామం ఆరంభంలో రోడ్డుపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఇక్కడ రెండు ప్రమాదకర మలుపులు ఉన్నాయి. దీనికి తోడు పక్కనే చెరువు ఉంది. దీంతో ఇక్కడ వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక్కడ మలుపులు ఉన్నప్పటికీ ఇసుక లారీలు మితిమీరిన వేగంతో దూసుకువస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డు నిర్మించినప్పటి నుంచి స్పీడు బ్రేకర్లు వేయాలని అధికారులను వేడుకుంటున్నామని, ఇప్పటికైనా ఈ మలుపుల వద్ద వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

– కె.గంగవరం

నేడు కేశవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం

మండపేట: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శుక్రవారం కేశవరంలో పర్యటించనున్నట్టు ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద గల కామాక్షి అమ్మవారి ఆలయం వద్ద నుంచి సంత మార్కెట్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ శ్రీనివాస్ గురువారం కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మండపేట: మారేడుబాక, గొల్లపుంత గ్రామ శివారు విద్యుత్ మోటారు లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్ను ఈఈ విజయానంద్ తెలిపారు. మారేడుబాక సబ్‌స్టేషన్ పరిధిలోని మారేడుబాక, మహిళనగర్, దిబ్బగరువు, గొల్లపుంత శివారు ప్రాంతాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

కపిలేశ్వరపురం: అంగర ఫీడర్ పరిధిలో మరమ్మతు పనులు నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అధికారి విజయానంద్ గురువారం తెలిపారు. ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అంగర, టేకి, శ్రీరామపురం, పడమర ఖండ్రిక గ్రామాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

నేటి నుంచి అంగన్‌వాడీ మహాసభలు

రామచంద్రపురం: అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మహాసభలు శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు మండపేటలో జరుగుతాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూకల బలరాం తెలిపారు. మహాసభల పోస్టర్‌ను పట్టణంలో గురువారం ఆవిష్కరించారు. యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కృష్ణవేణి మాట్లాడుతూ, ఈ మహాసభలో అంగన్‌వాడీ సమస్యలపై చర్చించి, నూతన కమిటీని ఎన్నుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రామచంద్రపురం ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలింపు.. ఇద్దరి అరెస్టు

రామచంద్రపురం రూరల్: వెలంపాలెంలో మద్యం, సారా తరలిస్తున్న ఇద్దరిని వేర్వేరు కేసులలో పోలీసులు అరెస్టు చేశారు. ద్రాక్షారామ ఎస్సై భుజంగరావు గురువారం ఈ వివరాలు తెలిపారు. చప్పిడి సత్యనారాయణ 180 మిల్లీలీటర్ల మద్యం బాటిళ్లు 9, ములగల అన్నవరం 3 లీటర్ల సారా తరలిస్తూండగా పోలీసులు స్వాధీనం చేసుకుని, ఇద్దరినీ అరెస్టు చేశారు.

విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ



ఆలమూరులో కళ్లజోళ్లు అందుకున్న విద్యార్థులతో వైద్య, ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా కంటి సమస్యలు గుర్తించిన 154 మంది విద్యార్థులకు గురువారం కళ్లజోళ్ల పంపిణీ చేశారు. వీటిని కంటి వైద్య నిపుణులు పి.శ్రీలక్ష్మి ఆధ్వర్యాన వివిధ గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వైద్య, ఆరోగ్య సిబ్బంది అందజేశారు. కంటి సమస్యల నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

వ్యభిచార నిర్వాహకుల అరెస్టు

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో వ్యభిచారం చేయిస్తున్న ఇద్దరిని ఆలమూరు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్సై ఎల్.శ్రీను కథనం ప్రకారం.. అక్రమంగా సొమ్ము సంపాదించాలనే దురుద్దేశంతో గ్రామానికి చెందిన భార్యాభర్తలు మహిళలను తీసుకువచ్చి, తమ ఇంట్లో గోప్యంగా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. దీనిపై కొత్తపేట డీఎస్పీ కేవీ రమణకు ఎస్పీ ఎస్.శ్రీధర్ సమాచారం అందించారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రావులపాలెం సీఐ ఎన్.రజనీకుమార్, ఎస్సై శ్రీను నేతృత్వంలో పోలీసులు ఆ ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో వ్యభిచార గృహ నిర్వాహకులిద్దరితో పాటు ఒక విటుడిని అరెస్టు చేశారు. ఎస్సై శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈవ్ టీజింగ్, రౌడీయిజం, జూదంపై ఉక్కుపాదం మోపుతామని చెప్పారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే సత్వరమే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

గుమ్మిలేరులో నేడు ఇళ్ల పట్టాల పంపిణీ

ఆలమూరు: గుమ్మిలేరులో శుక్రవారం ఇళ్ల పట్టాల పంపిణీ జరగనుందని సర్పంచ్ గుణ్ణం రాంబాబు, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. నియోజకవర్గంలోనే అత్యధికంగా 29.75 ఎకరాల్లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ జగనన్న కాలనీలో సుమారు 1,391 మందికి ఇళ్ల పట్టాలు అందజేయనున్నామన్నారు. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తారని తెలిపారు.

రైతులకు రుణాలు అందించేందుకు కార్యాచరణ

మామిడికుదురు: నారియల్ భారత్ న్యూట్రా ప్రొడ్యూసర్ కంపెనీలో సభ్యులైన రైతులు ఒక్కొక్కరికి రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకూ రుణాలు అందించే దిశగా కార్యాచరణ చేపట్టామని ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నయినాల వేణుగోపాల్ తెలిపారు. మామిడికుదురులో గురువారం జరిగిన రైతు సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ కంపెనీ ద్వారా రూ.17.50 కోట్ల కురిడీ కొబ్బరి వ్యాపారం చేస్తున్నామన్నారు.